# సజీవ చిత్రం

**-కె.కె.భాగ్యశ్రీ**

"ఏం సార్! ఎక్కడికెళ్లాలి?" అప్పుడే బస్ దిగిన నన్ను పలకరించాడు ఓ కుర్రాడు. ఆటోలోంచి బుర్ర బయటకు పెడుతూ.

చెప్పాను. 'రండి సార్' అతడి ఆహ్వానంమేరకు ఆటోలో ఎక్కి కూర్చున్నాను.

నేను వెళ్లాల్సిన ఊరు శ్రీకాకుళం జిల్లాలో ఓ మారుమూలన ఉంది. ఆంధ్ర రాష్ట్రంలోని అనేక ప్రదేశాలకు లేనట్లే దానికి కూడా కనీస ప్రయాణ సౌకర్యం కూడా కొరవడింది. ఉండి-ఉడిగి ఒక్కో ఆటోపోతుంది. అదీ కిక్కిరిసినట్లుగా మనుష్యుల్ని కూరుకుని కాని బయలుదేరదు. నేనెక్కిన ఆటో కూడా అదే పరిస్థితిలో ఉంది.

ఇరుక్కొని- ఇరుక్కొని కూర్చున్నాను.


కెపాసిటీకి మించి ప్రయాణీకుల్ని ఎక్కించుకోవడం, వారి ప్రాణాలతో ఆడుకోవడమే అన్న విషయం వారికి తెలియకా కాదు. 'ఈ ఆటో తప్పిపోతే పోయింది నెక్స్ట్ దాంట్లో వెళ్లచ్చుకదా' అన్న స్పృహ ప్రయాణీకుడికి లేకా కాదు.

కాస్త సర్దుకుంటే కొంచెం ముందుగా గమ్యం చేరవచ్చునన్న తాపత్రయం జనాలకుంటే, మరి రెండు టికెట్స్ ఎక్కించుకుంటే నాలుగు డబ్బులు మిగులుతాయన్న ఆశ డ్రైవర్‌ది.

పెద్ద సీట్లోనూ, ఎదురు సీట్లోనూ కూర్చున్న వారొక ఎనిమిది మంది, అటూ ఇటూ వ్రేలాడుతూ నించున్న వారొక ఎనిమిది మంది... వెరసి పదహారుగురున్నారా ఆటోలో.

"ఇందర్ని ఎక్కించుకొని రిస్క్ తీసుకోకపోతే ఏం బాబూ!" విసుగ్గా అన్నాను.

"అన్నీ తెలిసినవారు. మీరే అలా మాట్లాడతారేంటి సార్!" సెల్ఫ్ కొట్టి ఆటో స్టార్ట్‌చేస్తూ అన్నాడా కుర్రాడు చిరునవ్వుతో.



బరువుగా కదిలి, నెమ్మదిగా వేగం పుంజుకుంది ఆటో.

చుట్ట వాసన, పచ్చి ఉల్లిపాయల వాసన, నా చుట్టూ కూర్చున్న గ్రామీణుల శరీరాలనుండి వస్తున్న చెమట దుర్గంధం ఇవన్నీ కలగాపులగంగా కలసి గాలిలో వ్యాపిస్తూ వెగటు పుట్టిస్తున్నాయి. కడుపులో త్రిప్పుతున్నట్లుగా ఉంది. అయినా అవన్నీ భరిస్తూ ప్రయాణించక తప్పదు.

నా ఈ ప్రయాణానికి వెనుక మమతానుబంధాలను మధుర స్మృతులలోనైనా పదిలపరుచుకోవాలనే ఆకాంక్ష ఉంది.

ఎప్పుడో నన్ను విడిచి అనంత లోకాల్లోకి సాగిపోయిన నా మాతృమూర్తికి సంబంధించిన తీపి గురుతును చేజిక్కించుకోవాలనే తపన ఉంది.

దానికోసమే... కేవలం దానికోసమే హైదరాబాద్‌లో నేను చేస్తున్న గవర్నమెంట్ డాక్టర్ గిరీకి నాలుగురోజులు సెలవుపెట్టి ఇలా... ఈ వూరు మూల పల్లెటూరికి ప్రయాణమయ్యాను. శ్రీకాకుళం నుండి ఈ ఊరిదాకా కార్ బుక్ చేసుకుందామనే అనుకున్నాను. కాని, ఈ పల్లెకు రావడానికి ఎవరూ సిద్ధపడలేదు. అందుకే... ఈ ఇక్కట్ల ప్రయాణం.

త్రీవీలర్ కావడంవలన, బరువు ఎక్కువైన ఆటో అటు-ఇటు ఊగసాగింది.

రెండు గ్రామాలకు మధ్యగా పారుతున్న ఏటిమీద ఉన్న కాజ్‌వే మీదుగా సాగుతోంది మా ప్రయాణం.

ఈమధ్య కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు కాబోలు, పొంగిపొరలే నీటితో నిండుగా ప్రవహిస్తోంది ఏరు. మేం ప్రయాణిస్తున్న వాహనం ఏమాత్రం అదుపు తప్పినా ఏట్లో పడిపోవడం ఖాయం. ఆటోడ్రైవర్ కొద్దిపాటి నిర్లక్ష్యం చూపినా ఇంతమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి.

ఆటో ఏరు దాటి ఊరు పొలిమేరల్లో ప్రవేశించేవరకు కాస్త చితుగ్గా అనిపించింది. కాజ్‌వే క్రొత్తదే అయినాసరే, నిర్మాణంలో నాణ్యత కొరవడడం వలన ఎక్కడపడితే అక్కడ గోతులు, ఎగుడు-దిగుడులతో చాలా అధ్వాన్నంగా ఉంది.

"ఇంకా ఎంతసేపు ఈ ప్రయాణం?" అసహనంగా అడిగాను.

"పావుగంట ఓపిక పట్టండి సార్!" విసుగు దరిచేరనీయక చెప్పాడు ఆటోవాలా. మళ్లీ ఆలోచనలు కందిరీగల్లా ముసురుకున్నాయి నా మెదడులో.

నేను అమ్మను పోగొట్టుకొని ఎనిమిదేళ్లయ్యింది. అరవై కూడా రాకముందే అనుకోని వ్యాధికి గురై అమ్మ మరణించింది. ఆవిడ వయసులో ఉండగానే భర్తకు దూరమైంది. అప్పటినుండీ ఎన్నో కష్ట-నష్టాలకు ఓర్చి నన్ను పెంచి పెద్ద చేసింది. వ్యయ, ప్రయాసలకు తట్టుకొని నిలబడి నన్ను మెడిసన్ చదివించింది.

నేను గవర్నమెంట్ డాక్టర్‌గా విధులను నిర్వర్తించబోయే తొలిరోజు ఆమె చెప్పిన హిత వచనాలు ఈనాటికీ నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి.

"నాన్నా బాలూ... ఇలా నిన్ను డాక్టర్‌గా చూస్తుంటే నాకెంతో ఆనందంగా అనిపిస్తోంది. చాలా ఏళ్లుగా నేను కన్న కలలు నేటికి ఫలించాయి. వైద్య వృత్తి పవిత్రమైనది. ప్రాణంపోసిన దేముడి తరువాత, ఆ ప్రాణాలు నిలబెట్టే శక్తి వైద్యుడికి మాత్రమే ఉంది. నీలో స్వార్థపరత్వం, ధనాకాంక్ష దరిచేరనివ్వకు, పేదల సంక్షేమమే ధ్యేయంగా భావించి నీ వృత్తిధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించు."

అమ్మ చెప్పిన మాటలు నాకు ఆచరణీయమైనాయి. ప్రభుత్వోద్యోగిగా నా విధులను నిర్వహిస్తూనే, ఖాళీ సమయాల్లో పేద-సాదలకు వైద్యసేవలందించసాగాను.

"బాలు బాబు దేముడు. బీద-బిక్కి అంటే ఆయనకి అంతులేని దయ" నా వలన సహాయం పొందిన బడుగుజీవుల నోటి వెంట ఈ మాటలు వింటూంటే నాకు ఏనుగు అంబారీ అధిరోహించినంత ఆనందం కలిగేది.

అమ్మ ఆశయం నెరవేర్చగలుగుతున్నానన్న తృప్తితో మనసు నిండేది.

ఎన్నో కార్పొరేట్ హాస్పటల్స్ తాలూకా యాజమాన్యాలు పెద్ద పెద్ద జీతాలకు నన్ను రమ్మన వలసినదిగా అభ్యర్థించాయి.

కాని... ధనార్జన నా లక్ష్యం కాదు...

"హవ్వ! సిరిరా మోకాలడ్డడమంటే ఇదే... అంతంత జీతాలిస్తామంటూ ఆఫర్స్ వస్తూంటే, ఇలా కాణీకి, పరక్కి ప్రాక్టీస్ చేస్తానంటే ఎలాగండీ..."

పేదింటి పిల్లైనా బుద్ధిమంతురాలని అమ్మ ఏరికోరి తెచ్చుకున్న నా శ్రీమతి సంధ్య ధనమదం తలకెక్కి, నెత్తినోరు కొట్టుకు చేసిన వ్యాఖ్యలివి.

"నీకు తెలీదు సంధ్యా... ఆపదలో ఉన్న వారిని ఉదారంగా ఆదుకుంటానని అమ్మకు మాటిచ్చాను... అయినా ఇప్పుడు మనకేలోటు లేదు కద!" నా మాటలు ఆమెకు రుచించలేదు.

"లోటు లేకపోవచ్చు... కానీ... దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం మంచిది... ఎప్పుడో పోయిన ఆవిడగారికోసం... మనమిలా చాలీచాలని జీవితం గడపాలా!" చిర్రుబుర్రులాడింది సంధ్య.

నేను సమాధానమివ్వలేదు... ఒకవేళ ఇచ్చినా అది ఆమెను తృప్తిపరచలేదు.

ఆ తరువాత కూడా సంధ్య ఈ విషయమై నన్ను చాలాసార్లు వేధించింది. నేను పట్టించుకోకపోవడంతో ఆమె ఆగ్రహం కాస్తా అమ్మమీదకు మళ్లింది.

అమ్మ మాటను శిరసావహిస్తూ నేను నిజాయితీగా ఉండడం ఆమెకు మ్రింగుడు పడలేదు... నేనెంతో ప్రాణప్రదంగా చూసుకునే అమ్మకు సంబంధించిన వస్తువులన్నీ వీధిలోకి విసిరిపారేసింది నేనింటి దగ్గర లేని సమయంలో.

ఆఖరుకి ఆమె మూర్ఖత్వం ఎక్కడికి దారితీసిందంటే... పూజగదిలో అందరు దేముళ్లతో సమానంగా నేను ఆరాధించే అమ్మఫొటోను కూడా చించి ముక్కలు చేసింది.

ఆమెను ఆ చెంప- ఈ చెంప వాచేలా కొట్టాలన్నంత ఆవేశం కలిగినా, నాలోని ఇంగితం ఆ పని చేయనివ్వలేదు. కాని...నాకు ఆరాధ్య దేవతయైన అమ్మయొక్క భౌతిక రూపాన్ని ప్రతిబింబించే ఆ ఛాయాచిత్రాన్ని ప్రతిరోజూ కనులారా చూసుకునే అదృష్టం లేకుండా చేసిన ఆమెను క్షమించలేకపోయాను.

సంధ్యతో మాట్లాడ్డం మానేసి నెలపైనే అయ్యింది.

అమ్మ ఫొటోకి నెగిటివ్ లేదు. క్రొత్తిల్లు మారే హడావుడిలో అది ఎక్కడో పోయింది. అది తప్ప మరొక ఫొటో నాదగ్గర లేదు. ఈ ఫొటో అయినా బలవంతంచేసి మరీ తీయించాను. ఎందుకో అమ్మకు ఫొటో దిగడమంటే ఇష్టం ఉండేది కాదు.

ఏ విధంగానైనా అమ్మ ఫొటోను తిరిగి పొందాలన్న వాంఛ అధికమైంది.

అమ్మ అన్నదమ్ములకు ఫోన్ చేశాను. వాళ్లని మామయ్యలని పిలవడం నాకిష్టం ఉండదు. ఆనాడు... అసహాయ స్థితిలో ఉన్న అమ్మని ఒంటరి పోరాటం చేయమని వదిలేసిన వారంటే నాకు విపరీతమైన కోపం.

నేనీ స్థాయికి ఎదిగాక సంబంధాలు కలుపుకోవాలని ఉందంటూ నా గడప త్రొక్కారు. రెండుమూడుసార్లు. నేనే... ఏనాడో తెగిపోయిన బంధుత్వాలని తిరిగి అతుక్కోనవసరం లేదని నిక్కచ్చిగా చెప్పేశాను.

'కాని... ఈనాడు అమ్మ ఫొటోకోసం వారినాశ్రయించక తప్పేట్లు లేదు' అనుకొని పెద్ద మామయ్యకి ఫోన్ చేశాను.

"మీ అమ్మ ఫొటోనా! దాన్తో సంబంధం పుటుక్కుమని ముప్ఫైఏళ్ల పైనే అయ్యింది. ఇంకా దాని ఫొటోతో మాకు పనేంటని విసిరి పారేశాం." కర్కశంగా చెప్పాడతడు.

మనసు చివుక్కుమంది. నిశ్శబ్దంగా ఫోన్ పెట్టేశాను.

"ఏంటో... ఇన్నాళ్లకి అల్లుడికి మేం గుర్తొచ్చాం. అక్కర లేదని బయటకు నెట్టేసినవాళ్లు మాకెందుకు ఫోన్ చేసినట్లో..." చిన్న మామయ్య మనసులో కక్ష మాటల్లో వ్యంగ్య రూపంలో ప్రత్యక్షమైంది.

అతడి దెప్పుకోళ్లు మనసుమండించినా, అవసరం నాది కనుక సర్దుకున్నాను.

"మా అమ్మ ఫొటో పారేసుకున్నాను. నీ దగ్గరేమైనా ఉందేమోననీ..."

చిన్న మామయ్య కూడా వాళ్లన్నయ్య లాగే సమాధానం చెప్పాడు... కాకపోతే కాస్త సున్నితంగా.

హతాశుడనయ్యాను... నాకు అమ్మ ఫొటో పొందే అదృష్టమే లేదా!

కళ్లు చెమర్చాయి అప్పటికే.

"అయితే అల్లుడూ... మీ అమ్మ ఫొటోదొరికే అవకాశం మాత్రం నీకుందని చెప్తున్నాను"అన్నాడు చిన్న మామయ్య.

ఆ మాటలు నాలో అడుగంటిపోయిన ఆశకు ఊపిరి పోశాయి.

దాని ఫలితమే ఈ ప్రయాణం... అమ్మ చిన్ననాటి స్నేహితురాలైన అమృతం దగ్గరికి. ఎప్పుడో, తిరునాళ్లలో అమ్మ, అమృతం కలసి తీయించుకున్న ఫొటో ఆమె దగ్గర దొరకచ్చునని చిన్న మామయ్య చెప్పిన మాటలే నా ఈ పయనానికి మూల కారణం.

నా అన్వేషణలో సఫలీకృతుడనవుతానని మాత్రం కలలుగనడం లేదు నేను. మానవ ప్రయత్నం అంతే.

"ఏమిటీ... మీ అమ్మగారి చిన్నప్పటి ఫ్రెండ్ దగ్గరకా... అదీ ఉందో లేదో తెలియని ఫొటో కోసమా! చాలా బాగుంది మీ వ్యవహారం.

**ఇం**తకీ... ఆ అమృతంగారు ఇప్పుడెక్కడున్నారా! లేదా! ఒకవేళ ఉన్నా... ఎప్పుడో నలభై ఏళ్లక్రితం తీయించుకున్న ఆ ఫొటో ఆమె దగ్గరుందన్న గ్యారంటీ ఏముంది? అనేక రకాల సంశయాలు మెదడును కొరికిపోస్తున్నాయి. నేను ఆశావాదిని... అందుకే స్థిరమైన నమ్మకం నన్ను ముందుకు నడిపిస్తోంది.

రోజురోజుకీ పిచ్చి ముదిరిపోతోంది తమరికి...

గోడతోనో, తలుపు చెక్కతోనో మాట్లాడుతున్నట్లుగా, నా ప్రయాణం గురించి సంధ్యతో చెప్పినప్పుడు ఆమె వెటకారంగా ఆడిన మాటలివి.

నేను ఉలుకు- పలుకు లేకుండా బయలుదేరాను.

అమ్మ ఫొటో... నాకు లభిస్తుందా!

★★★

"దిగండి సార్... ఊరొచ్చేసింది..." ఆటోవాలా పిలుపుతో ఉలిక్కిపడ్డాను. అప్పటికే అందరూ దిగేయడంతో ఆటో దాదాపుగా ఖాళీ అయిపోయింది. బ్యాగ్ తీసుకొని క్రిందికి దిగి ఆటో అబ్బాయికి డబ్బులిచ్చాను.

కొద్దిదూరంలోనే కనబడుతున్న ఊరును తదేకంగా చూస్తూ నెమ్మదిగా నడక సాగించాను... మనసు పరిపరి విధాల పోతోంది.

పిచ్చివాడిలా ఇంత దూరం వచ్చాను గాని... వచ్చిన పని సానుకూలమౌతుందో లేదోనన్న ఆలోచన మదిదొలుస్తూనే ఉంది.

ఇంతకీ... ఆ అమృతంగారు ఇప్పుడెక్కడున్నారా! లేదా!

ఒకవేళ ఉన్నా... ఎప్పుడో నలభై ఏళ్లక్రితం తీయించుకున్న ఆ ఫొటో ఆమె దగ్గరుందన్న గ్యారంటీ ఏముంది?

అనేక రకాల సంశయాలు మెదడును కొరికిపోస్తున్నాయి.

నేను ఆశావాదిని... అందుకే స్థిరమైన నమ్మకం నన్ను ముందుకు నడిపిస్తోంది.

ఊరు దగ్గర పడేకొద్దీ ఏదో ఉద్విగ్నత... మనసు కల్లోల కడలిలా ఉంది.

ఊరి మొదట్లోనే ఎవరో ఒకతను నీళ్ల కావిడితో ఎదురయ్యాడు.

నీటి బిందెలెదురవడం శుభ సూచకం అని చెప్పేది అమ్మ.

ఎంత డాక్టర్‌నయినా తరతరాలుగా పాటించే మూఢ విశ్వాసాలకి అతీతుడిని కాదు.

అతడిని ఆపి "ఇక్కడ... అమృతం గారనీ..."

"ఓ... అమృతమ్మగోరా! అదుగో... ఆ కనబడే ఏపసెట్టు కాడికెళ్లి కుడేపు తిరగండి... అక్కడనుండి సరిగ్గా అయిదో ఇల్లే ఆయమ్మది." నాక్కావలసిన సమాచారం అందించాడు నీళ్లకావిడతను.

"థాంక్ గాడ్... నేనేపనిమీద వచ్చానో అది నెరవేరబోతోంది. అమృతం గారిని కలవబోతున్నాను." నింగిని చుంబించిన సంబరం నాలో.

వడి వడిగా అడుగులేస్తూ, వేప చెట్టు దగ్గరకుచేరి కుడివైపు తిరిగి ఐదో ఇల్లు లెక్కపెట్టుకుని అక్కడకు చేరాను.

పాత కాలపు పెంకుటిల్లు ఇది. కాస్త శిథిలమైనా... పురాతన నిర్మాణశైలికి అద్దం పట్టినట్లుగా, నివాసయోగ్యంగానే ఉంది.

మెట్లెక్కి వెళ్లి వీధి తలుపుకొట్టాను. దాదాపు నా వయసే ఉన్న ఒకాయన తలుపు తీశాడు.

"మీరు... " అతడి భృకుటి ముడివడింది ఆశ్చర్యంతో.

"నా పేరు బాలకృష్ణ... అమృతంగారిని కలవాలని వచ్చాను..."

"లోపలికి రండి..." అడ్డు తొలిగి లోపలికి ఆహ్వానిస్తూ, ఇంట్లోకి తొంగిచూసి "అమ్మా... నీకోసం ఎవరో వచ్చారు..." చిన్నగా అరిచాడతను.

కాస్సేపటి తరువాత అరవైఐదు డెబ్భై మధ్యలో వయసున్న ఒక స్త్రీమూర్తి ఆ గదిలోకి అడుగుపెట్టింది.

"ఎవరూ?" నన్ను ఆనవాలు పట్టడానికి ప్రయత్నించింది ఆవిడ. నేను ఆవిడకి వినయంగా నమస్కరించి, నేను అన్నపూర్ణ కొడుకునండీ..." అన్నాను.

అంతే... ఆవిడ ముఖంలో ఒక సంతోష తరంగం పెల్లుబికింది.

దగ్గరగా వచ్చి నా భుజాలు పట్టుకు తడుముతూ "నువ్వు... నువ్వు... మా పూర్ణ కొడుకువా!"అంది ఎంతో ఉద్వేగంగా.

నేను అవునని తలాడించాను.

"పూర్ణ... పూర్ణ ఎలా ఉంది?" గద్గద స్వరంతో ప్రశ్నించింది.

"అమ్మ పోయి ఎనిమిదేళ్లయ్యింది" చెప్పాను నిర్లిప్తంగా.

ఆవిడ కనులలో పలుచని నీటి తెరలు అలుముకున్నాయి.

"అయ్యో! పూర్ణ పోయిందా!" తనలోతాను గొణుక్కొని కాస్సేపాగి" అది ఏనాడు సుఖపడిందనీ..."అంటూ మొదలుపెట్టి తమ స్నేహంలోని కమ్మని ముచ్చట్లను, కోరినవాడి చేయందుకొనే యత్నంలో అమ్మ అయిన వారికి దూరమైన వైనాన్ని, కట్టుకున్న వాడి మోసానికి గురై ఒంటరి పోరాటం ఏ విధంగా సాగించిందో... అన్నీ... అన్నీ కళ్ళకు కట్టినట్లుగా వివరించింది.

అంతా వింటూంటే దుఃఖభారంతో గుండె బరువైంది.

ఈలోపు ఆమె కోడలు కాబోలు స్టీలుగ్లాసుతో మజ్జిగ తీసుకొచ్చి ఇచ్చింది. దబ్బాకులు వేసి, నిమ్మకాయ పిండిన చిక్కటి మజ్జిగ.

అది త్రాగాక దాహార్తి తీరి, ప్రాణం తెరిపిన పడింది. అప్పుడు చెప్పాను... నేనేపని మీద వచ్చానో.

ఆవిడ తెల్లబోయిందొక్కసారిగా "ఆ ఫొటోకోసం హైదరాబాద్ నుండి ఇంత దూరం వచ్చావా!"

"అది అమ్మ జ్ఞాపకం... అందుకే వచ్చాను... **ఇంతకీ** అది మీ దగ్గర..." సంశయంగా అన్నాను.

"ఉన్నట్లే జ్ఞాపకం..."అంటూ గదిలో ఓ మూలపెట్టిన పాతకాలపు చెక్కపెట్టె దగ్గరకు వెళ్లింది అమృతంగారు.

అందులోని వస్తువులన్నీ తిరగతోడి క్రింద మీద గాలించింది ఆవిడ. (మిగతా 12వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

నేను ఉత్కంఠతో ఎదురుచూశాను.

కొన్ని నిముషాల అనంతరం... అమృతంగారి ముఖంలో చిరునవ్వు కళ్లజూశాను.

కూర్చున్న చోటునుండి లేచి నావైపుకి వస్తూ "నీ అదృష్టం బాగుందయ్యా బాలూ... ఫొటో దొరికింది"అంది ఆవిడ మెరిసే కళ్లతో.

లాటరీలో కోటి రూపాయలు దొరికితే కూడా లభించనంత ఆనందం కలిగిందాక్షణం.

చిన్నపిల్లాడు తాయిలం లాక్కున్న చందాన, ఆవిడ చేతిలోంచి ఫొటో లాక్కున్నాను. అది బాగా పాతబడిపోయింది కాని పాడవలేదు. అందులో అమ్మ, అమృతం గారు లంగా, ఓణీలు ధరించి, రెండు జడలతో అపురూపంగా ఉన్నారు. పదహార్లేళ్ల వయసులో- లాలిత్యం, లావణ్యం పోకపోసిన వెన్నెలబొమ్మలా ఉంది అమ్మ. కాని... క్రూర విధి ఆమెలోని సౌకుమార్యాన్ని, సౌందర్యాన్ని హరించి, ఆమెను రంగు వెలసిన చిత్రంలా తయారుచేసింది. చనిపోయేనాటికి చిక్కి శల్యమైన అమ్మ గుర్తుకు రాగానే గుండెలో దేవినట్లయ్యింది.

"ఎందుకోగాని మీ అమ్మకి ఫొటోలంటే తగని అయిష్టం బాలూ... ఈ ఫొటోకూడా నా బలవంతం మీదే దిగింది..." ఆనాటి స్మృతి కదలాడింది అమృతం గారి మాటలలో.

"దీన్ని... నాకివ్వగలరా!" అడిగాను ఆ ఫొటోను గుండెలకి హత్తుకుంటూ.

ఆవిడ ఆప్యాయంగా చూస్తూ "తప్పకుండా బాబూ... అంత దూరంనుండి దీనికోసమై ప్రత్యేకంగా వచ్చిన నిన్ను వట్టి చేతులతో పంపుతానా!" అంది.

తృప్తిగా నిట్టూర్చి "థాంక్సండీ... మీ మేలు మరచిపోలేను. అమ్మ రూపం నా స్మృతిపథంలోంచి చెరిగిపోనివ్వకుండా కాపాడింది మీరుచేసిన ఈ ఉపకారం..." అన్నాను దాన్ని పాలిథిన్ కవర్‌లో పెట్టి, బ్యాగ్‌లో పదిలపరుచుకుంటూ.

చల్లగా నవ్వింది అమృతం. కనుమరుగవబోతున్న అమ్మ రూపాన్ని కన్నులముందు నిలిపిన మృతసంజీవని ఆవిడ.

వారి బలవంతం మీద ఆ రాత్రి అక్కడే విడిది చేశాను. కొసరి-కొసరి వడ్డించిన అమృతంగారిని చూస్తే అచ్చం అమ్మలాగే అనిపించారు.

వసారాలో నాకు మంచంవేసి పక్కపరిచారు. అమృతం గారి కొడుకు టేబుల్‌ఫ్యాన్ తెచ్చిపెట్టాడు. బయటనుండి చల్లని వర్షపు గాలి రివ్వున తాకింది.

ప్రయాణ బడలికతో అలసిన శరీరం విశ్రాంతిని కోరుకుంటోంది. పక్క వాసన చూడగానే నిద్ర ముంచుకొచ్చింది.

★ ★ ★

తెల్లవారుఝామున తెలివొచ్చి చూసేసరికి కరెంట్ పోవడం మూలాన ఫ్యాన్ ఆగిపోయి ఉంది. బయట హోరుమని వాన కురుస్తోంది. ఈదురుగాలులు వీస్తూండడంతో వాతావరణం అంతా తుఫానుని తలపింపజేస్తోంది.

నా వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చింది.

"తెల్లవారగానే బయలుదేరదామనుకుంటే ఇదేం ఉపద్రవం!" చిరాకుగా అనుకున్నాను.

అలా...ప్రొద్దున్న ఏడుగంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. కాలకృత్యాలు తీర్చుకున్నాక అమృతంగారి కోడలు వేడి ఇడ్లీలు టిఫిన్ పెట్టి, ఫిల్టర్ కాఫీ ఇచ్చింది. వాన తగ్గిందని నిర్ధారించుకుని బయలుదేరాను. వెళ్లే ముందు, అమృతంగారి పాదాలంటి నమస్కారం చేసి, జేబులోంచి అయిదువందల రూపాయల నోటు తీసి ఆవిడ చేతిలో పెడుతూ "చేసిన సహాయానికి వెల కడుతున్నానని అనుకోవద్దు... మిమ్మల్ని మా అమ్మగా భావించి ఇస్తున్నాను. మనవలకి పళ్లుకొని పెట్టండి..." అన్నాను.

ఆవిడ మొహమాటపడుతూనే తీసుకుంది.

వారివద్ద సెలవు తీసుకుని ఆ గడపదాటాను. ఒక్క రాత్రికే వారితో విడదీయలేని అనుబంధం ఏర్పడింది. అందుకే... వీడ్కోలు పలుకుతూంటే మది బరువెక్కింది.

ఊరి బయట ఆటోలు ఆగే స్థలంవద్దకు చేరుకున్నాను. యధాప్రకారం ఆటో కిటకిటలాడుతోంది. నేను ఎక్కి కూర్చోగానే బయలుదేరింది.

కుండపోతగా కురిసిన వానకు రోడ్లు జలమయమయ్యాయి. రోడ్డుమీద ఉన్న గోతుల్లో నీళ్లు నిలువ అయ్యాయి.

ఆటో కాజ్‌వే మీదికి చేరుకుంది. ఏరు నిండు గర్భిణీలా ఉంది. పారుతున్న నీటి ప్రవాహ వేగానికి గట్లు తెగిపోతాయేమోననిపిస్తోంది.

చిన్నపిల్లాడు తాయిలం లాక్కున్న చందాన, ఆవిడ చేతిలోంచి ఫొటో లాక్కున్నాను. అది బాగా పాతబడిపోయింది కాని పాడవలేదు. అందులో అమ్మ, అమృతంగారు లంగా, ఓణీలు ధరించి, రెండు జడలతో అపురూపంగా ఉన్నారు.

నా ప్రక్కనే డెబ్బైకి అటుఇటుగా వయసున్న ముసలామె కూర్చుని ఉంది. ఈమధ్య ఈ వయసున్న ఆడవారిని చూస్తే అమ్మే తలపుల్లో మెదులుతోంది.

ఆలోచనలో మునిగి ఉన్న నాకు ఏం జరిగిందో అర్థం కాలేదు.

నీళ్లల్లో నిండి ఉన్న గోతిలోకి ఆటో దిగడం, అదుపు తప్పి ఏట్లోకి ఒరిగిపోవడం క్షణాల్లో జరిగిపోయాయి.

ఒక్కసారిగా హాహాకారాలు చెలరేగాయి. ఆక్రందనలు మిన్నుముట్టాయి. తిరగబడిన ఆటోలోంచి బయటకి రావాలని శతవిధాల ప్రయత్నిస్తున్నాం అందరం. ఆ ప్రయత్నంలో... కాజ్‌వే తాలూకు స్థంభం చేజిక్కింది నాకు. భుజాన వ్రేలాడుతున్న బ్యాగ్‌ను జారిపోకుండా సర్దుకుని ఆ స్థంభాన్ని కరుచుకుని మీదికి ఎగబాకే ప్రయత్నం చేస్తున్నాను.

క్షణక్షణానికీ ఆటో నీటిలో మునిగిపోసాగింది. ఆటోలోంచి బయట పడినా, ఈతరాకపోవడంవలన ఏట్లో కొట్టుకుపోసాగారు కొంతమంది. కళ్లముందే కొన్ని ప్రాణాలు ప్రాణభీతితో అల్లాడుతున్నా ఏంచేయలేని అసహాయ స్థితి...ఎందుకంటే నాకూ ఈత రాదు.

ఏడుపులు- పెడబొబ్బలు ఎక్కువయ్యాయి. ఈత వచ్చిన ఆటో అబ్బాయి చేతికందిన వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు. వాతావరణం అంతా గందరగోళంగా ఉంది.

నా మట్టుకు నేను బ్యాలెన్స్ కాపాడుకుంటూ, గట్టునందుకునే ప్రయత్నం చేయసాగాను. కాస్త సఫలీకృతుడనయ్యాను కూడా.

"సార్... సార్... కాస్త హెల్ప్ చేయండి... ఈ ముసలామె చేయి అందుకోండి..." ఆటోలోంచి బయటపడి, నీటిలో మునకలు వేస్తున్న ఆవిడని రక్షించే ప్రయత్నంలో నన్ను అభ్యర్థించాడు ఆటో అబ్బాయి.

వెంటనే చేయి చాచబోయి ఆగిపోయాను. ఒక చేత్తో స్థంభం పట్టుకుని, రెండో చేయి చాస్తే భుజాన వ్రేలాడే ఎయిర్‌బ్యాగ్ జారి నీళ్లల్లో పడిపోయే ప్రమాదం ఉంది... నేనెంతో యాతన పడి సంపాదించుకున్న అమ్మ ఫొటో గంగపాలవుతుంది.

"సార్...ప్లీజ్... కాస్త చేయి అందివ్వండి..." ముసలామె చేతిని గట్టిగా పట్టుకుని నాకు అందించే ప్రయత్నం చేశాడు ఆటో అబ్బాయి.

మాతృ బంధమా! మానవత్వమా!... స్వార్థమా!... సాటి మనిషికి సహాయపడే సౌహార్ద్రమా! దేనికి ప్రాధాన్యతనివ్వాలి?"

క్షణకాలం మది ఊగిసలాడింది... చివరకు మానవత్వం వైపే మొగ్గింది నా మనసు... చదువుసంధ్యలంతగా లేకపోయినా, సంస్కారంతో తోటి వారిని రక్షిస్తున్న ఆటో అబ్బాయి నాకు మార్గదర్శిగా నిలిచాడు ఆ క్షణం.

నేను పట్టుకున్న స్థంభాన్ని ఒక చేత్తో గట్టిగా ఒడిసి పట్టుకొని, ఇంకొక చేత్తో ఆ ముసలామె చేయి అందుకున్నాను. బ్యాలెన్స్ నిలబెట్టుకుంటూ ఆమెను మీదకు లాగే ప్రయత్నంచేసి కృతకృత్యులయ్యాం నేను, ఆటో అబ్బాయి.

ఆమె మీదికి చేరాక నా చేయి విడిపించుకుని మోచేతి క్రిందికి జారిపోతున్న బ్యాగ్ భుజానికి లాక్కొనే ప్రయత్నం చేశాను. కాని... నా పట్టు తప్పి నీళ్లల్లోకి జారిపోయింది బ్యాగ్ ఒక్కసారిగా. వరద ఉధృతిలో కొట్టుకుపోతూ అంతకంతకు దూరమైంది అది.

హతాశుడనయ్యాను. కావాలని సంపాదించుకున్న అపురూపమైన వస్తువు దూరమైంది. నాకన్నా అభాగ్యుడింకొకడుంటాడా! గుండెల్లో గునపాలు దిగినంత బాధతో విలవిలలాడింది హృదయం. కళ్లంట నీళ్లు బొటబొట కారిపోతున్నాయి. భౌతికపరమైన అమ్మ రూపురేఖల నింక ఎన్నటికీ చూడలేను... ఏదో ఆవేదన మది కొరికిపోస్తోంది.

"ఏ తల్లి కందో గాని... ఆవిడ జన్మ ధన్యం బాబూ... నా ప్రాణాలు కాపాడారు మీరిద్దరూ..." నన్ను, ఆటో అబ్బాయిని చెరొక చేత్తో దీవిస్తూ అభినందించిన ముసలామె మాటలకు స్పృహలోకి వచ్చాను.

అప్పుడు కలిగింది ఒక తృప్తి నిండిన భావన. ముసలామె దీవెనలో నాకు మా అమ్మ కనిపించింది. అమ్మ ఫొటో పోగొట్టుకుంటేనేం!? ఇంకొకరికి అమ్మైన ఈమె ప్రాణాలు కాపాడగలిగాను.

అమ్మ రూపు నేను చూడలేకపోతేనేం!?... నా జ్ఞాపకాల్లో ఆమె అమరమై ఉంటుంది.

నేను ప్రాణదానం చేసిన ఈమెలోనే కాదు... ప్రపంచంలోని అమ్మలందరిలోనూ ఆమె సజీవ చిత్రమై శోభిల్లుతుంది.

అనిర్వచనీయమైన అనుభూతి ఏదో హృదయాన్ని ఆక్రమించుకోగా, ఒడ్డున చేరి... షాక్‌తో స్పృహకోల్పోయిన వారికి ప్రథమ చికిత్స అందించడానికి పూనుకున్నాను.

నాకు సహకరించసాగాడు ఆటో అబ్బాయి.

మానవత్వపు పరిమళం నలుదెసలనుండీ కమ్ముకోసాగింది నన్ను పులకితుడిని చేస్తూ.

★